

మన భానుపుర

ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

ఆదివారం 8 నవంబర్ 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 2



చీకటిని పారద్రోలే వెలుగుల పండుగ దీపావళి

భానుపురి/సూర్యాపేట ప్రతినిధి



చీకటిని పారద్రోలే వెలుగుల పండుగ దీపావళి అని.. దీపాల కాంతులవలె తెలంగాణలోని ప్రతి ఇంటా వెలుగులతో నిండాలిని ఆకాంక్షిస్తూ దీపావళి పండుగ సందర్భంగా ప్రజలందరికీ మాజీ మంత్రివర్యులు, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.. చీకటిని పారద్రోలే వెలుగుల పండుగగా దీపావళి పండుగను జరుపుకుంటామని.. నరకాసుర వదతో దీపావళి పండుగ జరిగినట్లు.. మన తెలంగాణ లోనూ చీకట్లు తొలగి మళ్లీ అభివృద్ధితో వెల్లివిరియాలన్నారు. అగ్ని కొలువైన దీపాల వెలుగులు మనలో అజ్ఞానాంధకారాన్ని తొలగించి, చైతన్యాన్ని రగిలించి బంగారు తెలంగాణ సాధనలో నూతనోత్తేజంతో ముందడుగు వేయాలన్నారు. అలాగే బాణసంచా పేల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పూజలకు ప్రత్యేకమైన కార్తీక మాసంలో చేసే పూజలు ఫలించాలని ఆయన ఆకాంక్షిస్తూ ప్రజలందరికీ దీపాలు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ దీపావళి ప్రజల జీవితాల లో వెలుగులు నింపాలి

భానుపురి/సూర్యాపేట టౌన్



తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పంతంగి వీరస్వామి గౌడ్ శనివారం తన రాష్ట్ర కార్యాలయం నుండి ఒక ప్రకటనలో తెలిపారు. దీపావళి అనేది చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీక అని, చెడుపై మంచి విజయానికి ప్రతీక అని తెలిపారు. రాష్ట్ర ప్రజలు సుఖంగా, ఆరోగ్య ంగా, సంతోషంగా పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ వెలుగుల పండుగ మీ జీవితంలో సుఖం, సంతోషం, శాంతి, సిరిసంపదలు తీసుకురా వాలని కోరుకుంటు న్నానని తెలిపారు. చీకటిని తొలగించి వెలుగును నింపే ఈ పవిత్ర పండుగ రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్యం, ఐశ్వర్యం, సమృద్ధిని ప్రసాదిం చాలని కోరారు. ప్రజలు వెలుగు ఇంటింటా ప్రకాశిస్తూ ప్రేమ, స్నేహ, సౌభ్రాతృ త్వంతో జీవిం చాలని, భేదభావం లేకుండా అందరినీ కలుపుకుని పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. పండు గను సురక్షితంగా, పర్యావరణహితంగా జరుపుకో వాలని కోరారు. ఈ దీపావళి ప్రతి ఇంటా సంతోషం నింపాలని, రాష్ట్రం సుభిక్షంగా, సురక్షితంగా ఉండాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా రియల్ ఎస్టేట్ అధ్యక్షుడు, జలగం సత్యం గౌడ్, రియల్ ఎస్టేట్ రాష్ట్ర కార్యదర్శి అమరవాది శ్రావణ్ కుమార్ రియల్ ఎస్టేట్ జిల్లా గౌరవ సలహాదారుడు, దేవత్ కిషన్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి, వెన్న శ్రీనివాస్ రెడ్డి, అయితే గాని మల్లయ్య గౌడ్, ఆకుల మారయ్య గౌడ్, మాదిరెడ్డి గోపాల్ రెడ్డి, బానోతు జానీ నాయక్, కొత్తపెళ్లి వెంకన్న, ఖమ్మం పార్టీ అంజయ్య గౌడ్, పట్టేటి కిరణ్, సారగండ్ల కోటేష్, రాపర్తి జానయ్య గౌడ్, శ్రీనివాసు తది తరులు పాల్గొన్నారు.

విధుల్లోనే కాదు.. సహోద్యోగి కష్టాల్లోనూ అండగా నిలిచిన సూర్యాపేట జిల్లా పోలీసులు..

భానుపురి/సూర్యాపేట



సహోద్యోగుల కష్టసుఖాల్లో ఒక కుటుంబంలా అండగా నిలవాలన్న జిల్లా ఎస్పీ పిలుపుతో సూర్యాపేట జిల్లా పోలీసు సిబ్బంది మానవత్వాన్ని చాటుకున్నారు. చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ అకస్మాత్తుగా గుండెపోటుకు గురై అనారోగ్యానికి గురయ్యారు. మెరుగైన వైద్యం కోసం ఆయనను హైదరాబాద్‌లోని ప్రముఖ గ్లెనీగిల్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాలకృష్ణ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో జిల్లా పోలీసు సిబ్బంది, ఒక కుటుం బంలా ఏకమై తమ వంతు సహకారం అందించారు. అందరూ కలిసి సేకరిం చిన రూ.లక్ష నగదును చివ్వెంల ఎస్సై మహేశ్వర్ బాలకృష్ణ కుటుంబ సభ్యులకు అందజేశారు. సహోద్యోగి కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవడం పోలీసు కుటుంబంలోని ఐక్యత, మానవత్వానికి నిదర్శనమని ఈ సందర్భంగా ఎస్పి నరసింహ గారు, పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు రమేష్, పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దీపావళి శుభాకాంక్షలు

భానుపురి/సూర్యాపేట ప్రతినిధి



చీకటిని పారద్రోలే వెలుగుల పండుగ దీపావళి అని.. దీపాల కాంతులవలె ప్రతి ఇంటా వెలుగులతో నిండాలి అని, దీపావళి పండుగ సందర్భంగా శ్రీ వాసవి రక్షణ కవచం వ్యవస్థాపకులు, శ్రీ వాసవి సేవాసమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం శుభాకాంక్షలు తెలిపారు.. చీకటిని పారద్రోలే వెలుగుల పండుగగా దీపావళి పండుగను జరుపుకుంటామని.. నరకాసుర వదతో దీపావళి పండుగ జరిగినట్లు, అందరి ఇండ్లలో చీకట్లు తొలగి మంచి వెల్లివిరియాలన్నారు. దీపాల వెలుగులు మనలో అజ్ఞానాం ధకారాన్ని తొలగించాలన్నారు.బాణసంచా పేల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విశేష మైన కార్తీక మాసంలో చేసే పూజలు ఫలించాలని దీపాలు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ వాసవి రక్షణ కవచం ద్వారా పేద ఆర్యవైశ్య కుటుంబాలకు ప్రతి నెల సహకారం అందిస్తున్నట్లు తెలిపారు.ఈ పవిత్రమైన కార్యక్రమంలో భాగస్వామ్యమైన ప్రతి ఒక్క ఆర్యవైశ్య కుటుంబాలకు భగవంతుని ఆశీస్సులు ఉండాలని తెలిపారు.

డాక్టర్ ఆనందరావుకు బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డు

భానుపురి/సూర్యాపేట టౌన్



వైద్యం కేవలం వృత్తి మాత్రమే కాదు, సేవా భావంతో చేస్తేనే సమాజానికి నిజమైన సేవ చేసినట్లు అవు తుందని నిరూపించారు ప్రముఖ ఈ ఎన్ టి వైద్యులు డాక్టర్ ఆనందరావు.సాధారణ డాక్టర్ జీవితానికి అతీతంగా, ఒక విద్యావంతుడిగా సమాజం పట్ల బాధ్యతగా, సామాజిక చైతన్యంతో, సమాజ సేవ చేయ డం చాలా ముఖ్యమని ఆయన నమ్ముతారు. ఆ నమ్మ కాన్ని గత 10 ఏళ్లుగా తన సేవల ద్వారా నిరూపి స్తున్నారు.డాక్టర్ ఆనందరావు గత పది సంవత్స రాలుగా సమాజానికి చేస్తున్న నిరంతర సేవలను గుర్తించి, కేంద్ర ప్రభుత్వం జాతీయ సంస్థ ఆయనను బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డుకు ఎంపిక చేసింది. ఇది సూర్యాపేట జిల్లాకే గర్వకారణం.ఈ విషయాన్ని డాక్టర్ ఆనందరావు స్వయంగా తన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. “నా సేవలను గుర్తించినందుకు దేవుడికి ధన్యవాదాలు” అనిఆయన భావోద్వేగంగా తెలిపారు.ఈ ప్రతిష్టాత్మక జాతీయ అవార్డును ఈ నెల 15వ తేదీన న్యూఢిల్లీలో జరిగే ఒక ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానం చేయను న్నారు. వైద్య రంగంలోనే కాకుండా, విద్యా, సామాజిక, సేవా రంగాల్లో డాక్టర్ ఆనందరావు చేస్తున్న కృషికి జిల్లా వ్యాప్తంగా పలువురు ప్రము ఖులు, ప్రజలు, వైద్యులు అభినందనలు తెలుపు తున్నారు. సూర్యాపేట నుండి ఒక వ్యక్తి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం యువతకు స్ఫూర్తిదా యకమని కొనియాడుతున్నారు.

సూర్యాపేట మున్సిపాల్టీ అభివృద్ధి కి అధిక నిధులు

భానుపురి /సూర్యాపేట ప్రతినిధి



ప్రజా ప్రభుత్వంలో సూర్యాపేట పట్టణం లోని అన్ని వార్డులలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలు అమలు చేస్తామని సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. శనివ రం సూర్యాపేట జిల్లా కేంద్రంలో 7వార్డు బిలల్ మజీద్ ఐదు లక్షల మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో నిర్మాణం చేయ నున్న సిసి డ్రైన్ కు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రతిపక్ష కౌన్సిలర్లు అనే తేడా లేకుండా అన్ని వార్డులలో సమానంగా అభివృద్ధి చేస్తున్నామని, సూర్యాపేట మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి వున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నివేదితవైస్ చైర్మన్ షఫీ ఉల్లా,కాంగ్రేస్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్,7వ వార్డు కౌన్సిలర్ ఈదా ప్రవీణ్, జిల్లా కాంగ్రేస్ నాయకులు దైద రవి, చంటి బాబు, విష్ణు స్వరూప్, పిట్టల నర్సి సైదులు, ఎ ఇ తిరుమలయ్య, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చీకట్లను తొలగించేందుకే హైమ్యాక్స్ లైట్ల ఏర్పాటు

భానుపురి/సూర్యాపేట టౌన్



పట్టణంలోని వివిధ వార్డుల్లోని ప్రధాన వీధుల్లో చీకట్లను తొలగించి వెలుగులు పంచేందుకు లైట్లను ఏర్పాటు చేయడం జరిగిందని సూర్యాపేట మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్యాది అన్నారు. శనివారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 32వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన హై మాక్స్ లైట్లు కౌన్సిలర్ కుంభం రాజేందర్ తో కలసి ప్రారంభించి మాట్లాడారు. దీపావళి పండుగను పురస్కరించుకొని 32 వ వార్డులోని ప్రధాన వీధిలో ఐమాక్స్ లైట్లు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.పట్టణ ప్రజల సమస్యలు పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా మున్సిపల్ పాలక వర్గం పనిచేస్తుందన్నారు. పట్టణంలోనూ వార్డుల్లో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. 32 వార్డులోని ప్రధాన వీధిలో చీకట్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విషయాన్ని తెల్పడంతో వెంటనే నిధులు మంజూరు చేసి లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీవుల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్ నాగుల వాసు, మాచర్ల ప్రసాద్, అయోధ్య, భార్గవ్, మణికంఠ, వెంకటేష్, మల్లారెడ్డి, వీరన్న, ఆర్ పి నాగూర్ వి, లక్ష్మి, అంగన్వాడి టీచర్ పద్మ, అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డ్యాన్స్ పోటీల్లో తమకు అన్యాయం జరిగిందంటూ విద్యార్థుల ఆవేదన

భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్



యువజన ఉత్సవాల్లో నిర్వహించిన డ్యాన్స్ పోటీల్లో న్యాయనిర్ణేతలు సరైన నిర్ణయం తీసుకోలేదని, తమ ప్రతిభకు తగిన గుర్తింపు ఇవ్వకుండా అన్యాయం చేశారని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట తమ నిరసనను వ్యక్తం చేస్తూ పోటీల నిర్వహణ, న్యాయనిర్ణేతల నిర్ణ యాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు.మరుగున పడుతున్న విద్యార్థుల కళలను వెలికితీయాలనే ఉద్దేశంతో యువజన ఉత్సవాల్లో లైవ్ డ్యాన్స్‌కు ప్రాధాన్యత ఇవ్వడం మంచి ఆలోచనేనని, అయితే పోటీల్లో అందరికీ సమాన న్యాయం జర గాలని విద్యార్థులు పేర్కొన్నారు. ఎలాంటి రికార్డెడ్ పాటలు లేకుండా సింగర్ స్వయంగా పాట పాడుతూ, డప్పు వాయిస్తుండగా తమ విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారని తెలిపారు.అయితే జడ్జిమెంట్ సమయంలో అదనంగా ఒక అమ్మాయిని ప్రదర్శనలో చేర్చారనే కారణంతో తమకు మొదటి బహుమతి రాలేదని చెప్పడం సరికాదన్నారు. మరోవైపు లైవ్ ప్రదర్శనలకు బదులుగా రికార్డెడ్ పాటలతో నృత్యం చేసిన వారికి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కళాకారులు పాడిన పాటలకు ప్రదర్శనలు ఇచ్చిన వారికి మొదటి బహుమతి ఇచ్చారని ఆరోపించారు. ఖమ్మం కళాకారులతో కలిసి ప్రదర్శన ఇచ్చిన తమను మాత్రం తిరస్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు.సూర్యాపేటలో జరిగిన లైవ్ కార్యక్రమానికి జిల్లా నుంచి కేవలం రెండు ప్రదర్శనలు మాత్రమే వచ్చాయని, వాటికి కూడా తగిన గుర్తింపు ఇవ్వలేదన్నారు. తమకు జిల్లా స్థాయిలో న్యాయం జరగకపోతే రాష్ట్రస్థాయి వరకు వెళ్లి తమ ప్రతిభను నిరూపించుకుంటామని స్పష్టం చేశారు. తమకు న్యాయం చేసి రాష్ట్రస్థా యి పోటీలకు అవకాశం కల్పించాలని విద్యార్థులు కోరారు. ఈ కార్యక్రమంలో సవవత్ రోషిని, జూలూరి హర్షిత, నక్క శరణ్య శ్రీ, జనగం వైష్ణవి, జూలూరి అనిత తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో అదృశ్యమైన నల్లగొండ యువతి జాడ దొరకలే

భానుపురి /నల్లగొండ



ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తెలంగాణ యువతి అకస్మాత్తుగా అదృశ్యం కావడం పట్ల శ్రీజ తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ప్రస్తుతం ఈ విషయం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపుతోంది.నల్లగొండ జిల్లా కనగల్ మండలం సుబ్బులాపురానికి చెందిన కోయ శ్రీజ రెడ్డి అమెరికాలోని బోస్టన్‌లో ఎంఎస్ చదువుతోంది. పార్ట్‌టైమ్ ఉద్యోగం కూడా చేస్తున్న ఆమె ఈ నెల 2న వాకింగ్‌కు వెళ్లగా 5 రోజులు గడుస్తున్నప్పటికీ ఇంకా తిరిగి రాలేదు.కార్సన్ బీచ్ హార్బర్ ప్రాంతంలో శ్రీజ చివరి సారిగా ఫోన్ లొకేషన్ గుర్తించినట్లు అమెరికా పోలీసులు వెల్లడించిన విషయం తెలిసిందే.దీంతో ఆమె ఆచూకీ కోసం పోలీసులు నాటి నుండి గాలింపు చర్యలు చేపట్టారు.మరోవైపు తమ కుమార్తె ఏమైందో తెలియక తల్లిదండ్రులు రూప,యాదగిరి రెడ్డిలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమ బిడ్డను క్షేమంగా స్వదేశానికి తీసుకురావాలని ప్రభుత్వాన్ని వేడుకుం టున్నారు.ఈ విష యాన్ని నల్లగొండ జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లారు. విదేశాల్లో చదువుకుంటున్న తమ బిడ్డ క్షేమంగా తిరిగి రావాలని తల్లిదండ్రులతో పాటు, ఆమె స్నేహితులు,బంధువులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.

దీపావళి పండుగ అందరి ఇళ్లల్లో ఆనందాన్ని నింపాలి



భానుపురి /సూర్యాపేట

దీపావళి పండుగ సందర్భంగా తమ వార్డులో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న చిరు ఉద్యోగులకు కౌన్సిలర్ బానోతు సైదులు నాయక్ నూతన వస్త్రాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగ సూర్యాపేట ప్రజల ఇళ్లల్లో సుఖ సంతోషాలు, సిరి సంపదలను తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు, నాయకులకు, వార్డు ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బానోతు సునీత సైదులు నాయక్, బాణోతు సురేష్, ధరావత్ రాజు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా విస్తృత ప్రచారం

భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఎన్నికల సంఘం లక్ష్యమని, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ సర్-2026 ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు.శనివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సర్-2026 ప్రక్రియ, ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణ, ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయడం, గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన, ద్వంద ఆబ్సెంట్ , షిఫ్టెడ్, డెత్, డబుల్ ఓటర్ల వివరాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సమీక్ష నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా మరో ఏడు రాష్ట్రాల్లో సర్-2026 ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించిందని తెలిపారు. ఈ అవకాశం పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

-ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణకు మరొక అవకాశం

సర్-2026 ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారు మరోసారి తమ ఫారాలను సమర్పించేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారు. గైర్హాజరు, చిరునామా మార్పు, మరణం, డబుల్ తదితర కారణాలతో ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆబ్సెంట్ , షిఫ్టెడ్, డెత్, డబుల్ జాబితాలో తమ పేర్లు ఉండి ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించని అర్హులైన వారు నవంబర్ 21వ తేదీ వరకు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించవచ్చని తెలిపారు. అర్హులైన వ్యక్తులు తమ వివరాలను సంబంధిత ఎన్నికల అధికారులకు సమర్పించి ఓటరు జాబితాలో పేరు చేర్చుకోవాలని సూచించారు. ఇప్పటికే ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

-అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి



ఎన్నికల సంఘం ప్రధాన ఉద్దేశ్యం అర్హులైన ఏ ఒక్క ఓటరును కూడా ఓటు హక్కుకు దూరం చేయకుండా చూడటమేనని సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఓటరు జాబితాలో పేరు నమోదు కాని అర్హులైన వ్యక్తులు తమ వివరాలను సంబంధిత ఎన్నికల అధికారులకు సమర్పించి ఓటరు జాబితాలో పేరు చేర్చుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు.బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటి విచారణ చేపట్టి, అర్హులైన ఓటర్లను గుర్తించి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేయాలని సూచించారు. ఫారాలు అందని ఓటర్లను గుర్తించి, వారికి తిరిగి ఫారాలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫోన్ నంబర్లు, ఈ-మెయిల్ ఐడీలు అనుసంధానమై ఉన్న ఓటర్లకు వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా కూడా ఫారాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.

-పోలింగ్ కేంద్రాల వారీగా జాబితాలను ప్రదర్శించాలి

గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన,ఆబ్సెంట్ , షిఫ్టెడ్, డెత్, డబుల్ ఓటర్ల వివరాలను పోలింగ్ కేంద్రాల వారీగా జాబితాల రూపంలో ప్రదర్శించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఆయా ఓటర్ల పేర్లు జాబితాలో చేర్చకపోవడానికి గల కారణాలను కూడా స్పష్టంగా పేర్కొనాలని తెలిపారు.ఈ వివరాలను ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉంచడంతో పాటు, ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లో కూడా పోలింగ్ కేంద్రాల వారీగా అందుబాటులో ఉంచాలని సూచించారు. జాబితాల్లోని వివరాలను పారదర్శకంగా ప్రజలకు తెలియజేయాలని, అర్హులైన



ఓటర్లుతమ పేర్లను తిరిగి నమోదు చేసుకునేందుకు అవసరమైన సమాచారం అందించాలని తెలిపారు.

-ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణకు ఆన్‌లైన్ సౌకర్యం

ఓటర్లు తమ పాత ఎపిక్ నంబర్ ఆధారంగా ఎన్నికల సంఘం వెబ్‌సైట్, ఈసీఐనెట్ యాప్ ద్వారా కూడా ఎన్యుమరేషన్ ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని సమర్పించవచ్చని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారు.ఒకే చిరునామాలో నివసిస్తున్న ఓటర్లు గతంలో ఎన్యుమరేషన్ ఫారం ఎందుకు సమర్పించలేకపోయారో వివరిస్తూ డిక్లరేషన్ ఇవ్వాలని సూచించారు. చిరునామా మారిన వారు సంబంధిత చిరునామా ఆధారాలను సమర్పించాలని తెలిపారు. అదే రాష్ట్రంలో ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్లు కొత్త చిరునామాకు సంబంధించిన ఆధారాలను సంబంధిత ఎన్నికల అధికారులకు సమర్పించాలని పేర్కొన్నారు. సమర్పించిన ఫారాలను సంబంధిత ఎన్నికల అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హులైన ఓటర్ల పేర్లను తుది ఓటరు జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ ప్రక్రియపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు తుది ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, ఎలక్షన్ సిబ్బంది రాజేందర్ రెడ్డి, భరత్, రాణదీర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా, విక్రయం, వినియోగంపై కఠిన చర్యలు

భానుపురి /సూర్యాపేట టౌన్

గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపారు. ఇందులో భాగంగా సూర్యాపేట రెండవ పట్టణ పోలీసులు 1,500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు ప్రధాన నిందితులు పరారీలో ఉన్నారు. నమ్మదగిన సమాచారం మేరకు ఎస్సై రామచంద్ర గౌడ్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం రోజున సాయంత్రం పట్టణంలోని చివ్వెంల రహదారిపై అమ్మ గార్డెన్ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో పోలీసులను గుర్తించిన ఇద్దరు ప్రధాన నిందితులు పరారయ్యారు. గంజాయి తీసుకునేందుకు అక్కడికి వచ్చిన మరో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న 1,500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో ప్రధాన నిందితులైన బొంత అవినాష్, సోమపంగు నాని వర్ధన్ ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయిని తీసుకొచ్చేందుకు వెళ్లినట్లు, అరెస్టయిన నలుగురు వారికి డబ్బులు సమకూర్చినట్లు వెల్లడైంది. గంజాయిలో కొంత వినియోగించుకుని, మిగిలినది విక్రయించి డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో వారు ఈ వ్యవహారంలో పాల్గొన్నట్లు గుర్తించారు. రూపాని సందీప్ (20) జె.జె. నగర్, సూర్యాపేట.బొడ్డు భరత్ (21) -- అన్నదురై నగర్, సూర్యాపేట, పులుసు సాయి విశాల్ గౌడ్ -- వినాయక నగర్, సూర్యాపేట.శీలం శ్రీకాంత్ లింగయ్య (24) వెంకటేశ్వర కాలనీ, సూర్యాపేట పట్టుపడగా బొంత అవినాష్. సోమపంగు నాని వర్ధన్. పరారీలో ఉన్నట్టు తెలిపారు.పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ కేసులో నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి:

గంజాయి వినియోగం యువత ఆరోగ్యాన్ని, భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తుందని ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య హెచ్చరించారు. గంజాయి రవాణా, విక్రయం, కొనుగోలు, వినియోగం చట్టరీత్యా నేరమని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి అక్రమ రవాణా లేదా విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ఎస్సై రామ చంద్ర గౌడ్,, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీరాములు, వీరయ్య, అజ్గర్ అలీ, రామనర్సయ్య, కానిస్టేబుల్ కొండా రమేష్, నవీన్ లను పోలీసు అధికారులు అభినందించారు.



జిల్లా పరిషత్ పాఠశాల సందర్శించిన కలెక్టరేట్

భానుపురి/హుజూర్ నగర్



సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శనివారం బాలికల జిల్లా పరిషత్ హైస్కూల్ హుజుర్నగర్ పాఠశాలను సందర్శించినారు.ఈ సందర్భంగా కలెక్టర్ స్కూల్ అభివృద్ధి పనులకు ముప్పై లక్షల రూపాయలు మంజూరు చేయటం జరిగినది . అందులో భాగం గా సివిల్ వర్క్, మేజర్, మైనర్ రిపేరు వర్క్ ని పరిశీలించారు. ప్లే గ్రౌండ్ లెవల్ చేయించి బేస్ బాల్, వాలీ బాల్ కోర్టుని తయారు చేయమని సూచించారు. అలాగే కంప్యూ టర్ ల్యాబ్ పరిశీలించి ల్యాబ్ ను త్వరగా పూర్తిచేయమని ఆదేశించినారు. మిగిలిన అన్ని పనులను నవంబర్ 20 లోపు పూర్తి చేయాలని ఆదేశిం చినారు. 9వ, తరగతి విద్యార్థుల వద్దకు వెళ్ళి పిల్లలను చదివించి ప్రశ్నలు అడిగి వారి నుంచి జవాబులు రాబట్టి సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమములో. పాఠశాల హెచ్ ఎం దాడి నర్సిరెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్, డి.ఈ.రమేష్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొనటం జరిగినది.

క్యాన్సర్ పై అవగాహన పెంచుకుందాం

భానుపురి/మోతె

జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమాన్ని మోతె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. పెండెం వెంకట రమణ, ఎంబిబిఎస్, డి సి హెచ్ ప్రారంభించారు. ప్రతి సంవత్సరం నవంబర్ 7వ తేదీన జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు, క్యాన్సర్ ను ప్రారంభ దశలో గుర్తించినట్లయితే మెరుగైన చికిత్స అందించి ప్రాణాలను కాపాడవచ్చని ఆయన తెలిపారు. పొగాకు వినియోగం, ధూమపానం, మద్యపానం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామం లేకపోవడం వంటి అంశాలు కొన్ని రకాల క్యాన్సర్లకు ప్రధాన కారణాలుగా ఉంటాయని పేర్కొన్నారు.ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, పొగాకు మరియు మద్యపానానికి దూరంగా ఉండాలని సూచించారు. నోటిలో పుండ్లు దీర్ఘకాలంగా తగ్గకపోవడం, రొమ్ములో గడ్డలు, అసాధారణ రక్తస్రావం, కారణం తెలియని బరువు తగ్గడం, దీర్ఘకాలిక దగ్గు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను



సంప్రదించాలని కోరారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది ద్వారా నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని, ముఖ్యంగా నోటి, రొమ్ము మరియు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లకు సంబంధించి ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ఉపయోగించే ఒక మోతాదు హెచ్ పి వి వ్యాక్సిన్ ను 14 సంవత్సరాలు నిండిన ప్రతి బాలికకు వేయించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు క్యాన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపు, పరీక్షలు మరియు చికిత్సపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డా. జి. చంద్ర శేఖర్, వైద్యాధికారులు డా. భవాని, డా. శ్రీనివాస రాజు, డిప్యూటీ డెమో వి. సంజీవ్ రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.